పేరుకే.. 50 పడకల ప్రభుత్వాసుపత్రి

- డాక్టర్ల కొరతతో రోగులకు అవస్థలు
- ప్రథమ చికిత్సకే పరిమితమవుతున్న వేంపల్లె కమ్యూనిటీ వైద్యశాల
- చిన్నపాటి వైద్యానికి సుదూర ప్రాంతాలకు రెఫర్
- మెరుగైన వైద్యం అందక పేద ప్రజల ఇక్కట్లు
- విద్య, వైద్యశాలల అభివృద్ధి చేస్తామని కూటమి నేతల ప్రగల్భాలు


వేంపల్లెలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్


సీహెచ్‌సీ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు


నిరుపయోగంగా ఎక్స్‌రే గది

వేంపల్లె : పల్లె చుట్టూ ఉన్న ఐదు మండలాలతోపాటు పట్టణ, పరిసర ప్రాంతాలకు మెరుగైన వైద్యసేవలు అందడంలేదు. రోజు రోజుకు వేంపల్లె జనాభా పెరిగిపోతోంది. 30 పడకల ఆసుపత్రి ఉండగా.. రోజురోజుకు పెరుగుతున్న జనాభా దృష్ట్యా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి స్థాయిని పెంచి 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేశారు. అయితే ఫలితంగా అత్యవసర సేవలు అందడంలేదు. వివిధ విభాగాలకు పర్మినెంట్ డాక్టర్లులేక పేదప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక వైద్యం మినహా మిగిలిన వైద్య సేవలకు కడప, తిరుపతి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అత్యవసర సమయాలలో అంతా దూరం వెళ్లలేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది. విద్య, వైద్యశాలల అభివృద్ధి చేస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలకడమే తప్ప చేసిందేమీలేదని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.

రోజురోజుకు పెరుగుతున్న ఓపీ

వేంపల్లె పెద్ద ప్రభుత్వాసుపత్రిగా పేరున్న వేంపల్లె కమ్యూనిటీ వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. గతంలో 200 నుంచి 250 వరకు ఉండే ఓపీ.. ప్రస్తుతం 350 నుంచి 400 వరకు చేరింది. వేంపల్లె పట్టణంతోపాటు చుట్టూ ఐదు మండలాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తుంటారు.

కడప, తిరుపతి ప్రాంతాలకు రెఫర్

వేంపల్లె చుట్టూ ఐదు మండలాల పరిధిలోని రహదారి ప్రమాదాలు జరిగినా, పాము కాటుకు గురైనా, పురుగు మందులు తాగినా, విష మాత్రలు మింగినా వారిని వేంపల్లె ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు తరలిస్తుంటారు. వైద్యులు, వైద్య సిబ్బంది కేవలం ప్రథమ చికిత్స చేసి కడప, తిరుపతి ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సరైన వసతులు లేకపోవడంతోనే రెఫర్ చేయాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

సీహెచ్‌సీలో వేధిస్తున్న డాక్టర్ల కొరత

వేంపల్లె ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 12 మంది వివిధ విభాగాల డాక్టర్లు నియమించారు. అయితే వివిధ కారణాలవల్ల డాక్టర్లు సెలవు పెట్టి వెళ్ళిపోయారు. ప్రస్తుతం ఐదు మంది డాక్టర్లచే వైద్య సేవలు అందిస్తున్నారు. అనస్థియా ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ డాక్టర్లు ఉన్నారు. గైనకాలజిస్టులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే కాన్పులు చేయడం విశేషం. ఒకవేళ సిజేరియన్ చేయాల్సి వస్తే కడప రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తారు. మిగిలిన చిన్న పిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్ వైద్యులు, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్ వైద్యులు ఇద్దరు, జనరల్ మెడిసిన్ వైద్యులు లేకపోవడంతో పేద ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్స్‌రే ప్లాంటు సరే సిబ్బంది లేరు

వేంపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎక్స్‌రే ప్లాంట్ ఉన్నా.. అందుకు అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. ఎక్స్‌రే ప్లాంటు ఏర్పాటు చేసి ఇన్‌స్టాలేషన్ చేసి గాలికి వదిలేశారు. అందులో సీఆర్పీ మిషన్ ఏర్పాటు చేసి రేడియాలజీ గ్రాఫర్‌ను నియమించాల్సి ఉంది. ఎవరిని నియమించకపోవడంతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. దీంతో చిన్న ప్రమాదాలు జరిగిన దూర ప్రాంతాలకు వెళ్లి ఎక్స్‌రేలు తీయించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

నిధులను దారి మళ్లించడంతో ఆగిన పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేశారు. అందుకు అనుగుణంగా 50 పడకల భవనాలకు నాబార్డ్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ 4.60 కోట్లు నిధులను మంజూరు చేశారు. అందుకు సంబంధించిన నిర్మాణ పనులను ప్రారంభించి 60 శాతం పనులను పూర్తి చేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిధులను దారి మళ్లించడంతోనే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించడం లేదని చెబుతున్నాడు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ఆపివేయడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. టాయిలెట్లలోని నీరు పోక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం

కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి ఆవశ్యకతను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం ఉన్న వైద్యశాలను 50 పడకలుగా అభివృద్ధి చేస్తే 24 గంటలు అత్యాధునిక సేవలు అందుతాయి. వచ్చే బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తే వైద్యశాల నిర్మాణ పనులు పూర్తవుతాయి. పూర్తిస్థాయిలో డాక్టర్లు లేకపోవడంతోనే మెరుగైన వైద్య సేవలు అందించలేకపోతున్నాం. మార్చి లోపల నూతన భవనాలు, పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమిస్తారని ఉన్నతాధికారులు తెలియజేశారు.

– శేఖర్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, వేంపల్లె

నేటి నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కలమాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అంతర్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి నేతృత్వంలో యూనివర్శిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బాల్ బ్యాడ్మింటన్ (బాలురు), హ్యాండ్ బాల్ (బాలురు, బాలికలు), సాఫ్ట్ బాల్ (బాలురు, బాలికలు) పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

9 గంటలు నిరంతర విద్యుత్ ఇవ్వాలి

వేంపల్లె : వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతర విద్యుత్‌ను సరఫరా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మస్తాన్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తామని రైతులకు హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలన్నారు. అయితే ఉచిత విద్యుత్‌ను 7 గంటలు మాత్రమే సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడం శోచనీయమన్నారు. ప్రస్తుతం అరటి టన్ను ధర రూ.30 వేలు పలుకుతోందని, ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరా 7 గంటలకు కుదించడంపై ఆయన మండిపడ్డారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని, రైతు నడ్డి విరిచేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలోని సాగులో ఉన్న అరటి పంటలను దృష్టిలో ఉంచుకుని మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణ మందిర ప్రథమ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సతీసమేత శ్రీకృష్ణుడు

వేంపల్లె : మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామం వద్ద వెలసిన శ్రీకృష్ణ మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని శ్రీకృష్ణ మందిరం ఆలయ సేవకులు తెలిపారు. ఆలయ అర్చకులు కౌస్తుభ నేతృత్వంలో స్వామివారికి కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, గణపతి పూజ, అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం శాంతి హోమం, మహా నైవేద్యం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో కాంతి వంతంగా, చలువ పందిళ్లతో సుందరీకరంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తిరుమలేసు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సక్రమంగా సరుకులను పంపిణీ చేయాలి


పౌరసరఫరాల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

ముద్దనూరు : చౌకదుకాణాలకు సరుకులను పౌరసరఫరాల గోడౌన్ నుంచి సక్రమంగా పంపిణీ చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిణి సాయిశ్రీ ఆదేశించారు. గురువారం ఆమె కొత్తపల్లె వద్ద నున్న పౌరసరఫరాల గోడౌన్‌ను తనిఖీ చేసి నిల్వ చేసిన నిత్యావసర సరుకులు బియ్యం, కందిబేడలు, చక్కెర స్టాకు వివరాలు, తూకాలను, చౌకదుకాణాలకు వాటిని పంపిణీ చేసే విధానాన్ని, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి, పెండింగ్ అర్జీలను, సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రథమ చికిత్సపై సర్టిఫికెట్ కోర్సును జువాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ యు.శ్రీనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ అనారోగ్యాన్ని, చిన్న గాయాలను, సాధారణ శరీర రుగ్మతలను నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా చేసే వైద్య విధానమే ప్రథమ చికిత్స అన్నారు. ప్రథమ చికిత్స వలన ప్రాణాలను కాపాడి రోగికి ధైర్యం అందించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


హస్రత్‌ను పరామర్శిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు పట్టణ అధ్యక్షుడు హస్రత్ తండ్రి సయ్యద్ సాహెబ్ ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హస్రత్ నివాసానికి వచ్చి ఆయనను పరామర్శించారు. పార్టీ అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే విత్తనం విక్రయించాలి

గోపవరం: ఎమ్మార్పీ ధరలకే విత్తనం, పురుగు మందులు విక్రయించాలని బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ సూచించారు. మండలంలోని టీటీఎస్ ఆర్గో ఏజెన్సీ విత్తన, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, స్టాకు పొజిషన్, వే బిల్లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసినపుడు బిల్లులు ఇవ్వని పక్షంలో ఏవో, ఏడీఏ కార్యాలయ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయాలన్నారు.

చిన్న శేషవాహనంపై వేంకటరమణుడు


చిన్న శేషవాహనంపై శ్రీ వేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పట్టణంలో నడిబొడ్డున వెలసిన పద్మావతిసమేత కల్యాణ శ్రీ వేంకటరమణస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మూడవ రోజు స్వామివారు ఉదయం చిన్న శేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై పులివెందుల పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవ దేవుని దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తులు తరించారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారు ఊరేగుతుంటే భక్తులు కనులారా చూసి కాయకర్పూరాలు సమర్పించి నమస్కరించుకున్నారు. తిరుమల మాడవీధులను తలపించేలా స్వామివారు ఉత్సవం కనువిందుచేసింది. స్వామి గ్రామోత్సవం వెంబడి గోవిందనామ జపాలతో కొనసాగింది. భక్తిపారవశ్యంతో పురవీధులు పులకించిపోయాయి.

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీ వేంకటరమణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నివేదన, ప్రధాన నిత్య హోమాలు, కలశారాధనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉభయదారులచే విశేష పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గ్రామోత్సవానికి ముందు ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలు వెలిగించి ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

నేటి అలంకారములు

శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో విశేష పూజలతోపాటు సాయంత్రం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

కొత్త పరిశోధనల ద్వారా మరింత సామర్థ్యం

వేంపల్లె : ఇంజనీరింగ్ రంగంలో కొత్త పరిశోధనల ద్వారా మరింత సామర్థ్యం పెరుగుతుందని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో అభివృద్ధి చెందుతున్న అంశాలపై పరిశోధనలు చేయడానికి రాష్ట్రీయ ఉచ్చతర శిక్షా అభియాన్ (రుసా) కింద మూడు ప్రాజెక్టులు మంజూరయ్యాయని, ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.34 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రొఫెసర్లు అమరేంద్రకుమార్ సంద్ర, డాక్టర్ ఎస్.జిలాని, డాక్టర్ జి.రమేష్‌లు ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టులు చేయనున్నారని తెలిపారు. క్యాంపస్‌లో పరిశోధనలు చేయడం ద్వారా విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి తోడ్పడుతుందన్నారు.

నూతన బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు


వేంపల్లె ఆర్టీసీ బస్టాండుకు బస్సు సర్వీస్‌లో వచ్చిన ఫర్నిచర్


ఫర్నిచర్‌ను ఆర్టీసీ బస్టాండులో చేర్చుతున్న డీఎం రామకృష్ణ

బస్టాండుకు చేరిన ఫర్నీచర్

సాక్షి ఎఫెక్ట్..

వేంపల్లె : పట్టణంలో నిర్మించిన నూతన బస్టాండుకు సంబంధించి ఫర్నిచర్ వచ్చిందని పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే నూతన బస్టాండ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇటీవల వేంపల్లెలో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ప్రారంభానికి నోచుకోలేదని వరుస కథనాలు రావడంతో ఆర్టీసీ అధికారులలో చలనం వచ్చింది. అలాగే హైదరాబాద్‌కు సంబంధించిన బస్సు సర్వీస్‌పై విలేకరులు అడుగగా హైదరాబాద్‌కు సంబంధించిన లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని, కానీ ప్రయాణీకులు లేనందున నష్టాలు వస్తున్నాయని, బస్సు సర్వీసు రద్దు చేశామన్నారు. అలాగే ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీకి ఉదయం, సాయంత్రం రెండు పూటలా సర్వీసును కొనసాగించాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు కోరగా.. ఈ విషయంపై పునరాలోచన చేస్తామన్నారు. నూతన బస్టాండు నిర్మాణం పూర్తయిందని ప్రారంభించేందుకు ఉన్నతాధికారుల చేతులలో ఉందన్నారు. ఇంత వరకు సంబంధిత కాంట్రాక్టర్ మాకు అప్పజెప్పలేదని, కాగా ఆర్టీసీ సిబ్బంది లేక డిపో మేనేజర్ ఫర్నిచర్‌ను మోసుకెళ్లి భద్రపరచడం చూస్తుంటే విశేషంగా ఉంది. కార్యక్రమంలో పులివెందుల ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి


ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్

వేంపల్లె : మైనార్టీ పిల్లల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా ప్రతి మైనార్టీ విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏపీ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్ సుగుణమ్మతో పాఠశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల సాంద్రత పెంచాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా క్లాసులు వారీగా వెళ్లి విద్యార్థినులతో ఆయన ముచ్చటించారు. పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ప్రభుత్వం కూడా అన్ని వసతులు కల్పిస్తుందని వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి ఇమ్రాన్, సివిల్ సప్లయ్ సంస్థ డైరెక్టర్ పర్వీన్ తాజ్, ఎస్ఐ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా నడిచేది..?


ముద్దనూరు రోడ్డులో అడ్డంగా నిలబడి ఉన్న బైక్‌లతో అక్రమణకు గురైన ఫుట్‌పాత్

ఎర్రగుంట్ల : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని ఫుట్‌పాత్‌లన్నీ చిన్న వ్యాపారస్తుల తోపుడు బండ్లతో, బైక్‌లతో నిండిపోవడంతో పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో పాదచారులు రోడ్డుకు మధ్యలో నడవాల్సి వస్తోంది. దీనివలన ఇటీవల చాలా ప్రమాదాలు జరిగాయి. ఫుట్‌పాతులపై చికెన్ పకోడ బండ్లు, దుకాణాల ఎదురుగా షాపుల వారి పబ్లిసిటీ బ్యానర్లు పెట్టుకోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనిపై ఇటీవల మున్సిపల్ అధికారులు ఫుట్‌పాత్‌లపై ఉన్న వాటిని తొలగించాలని హెచ్చరికలు చేశారు. అయినా స్పందించడంలేదు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మార్చి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం


వ్యాపార సంస్థల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ పగడాల జగన్నాథ్



ఎర్రగుంట్లలో షాపులలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

కమలాపురం : మార్చి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులను సంపూర్ణంగా నిషేధిస్తున్నామని, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారుల సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని, ఆ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, పేపర్ కవర్లు, గ్లాసులు వినియోగించాలన్నారు. ముఖ్యంగా వ్యాపార సంస్థల ప్రతినిధుల సహకారం ఉంటే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధిస్తామన్నారు. ఎవరైన ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే ప్రతి దుకాణాదారుడు తన షాప్ బయట ప్లాస్టిక్ నిషేధంకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వ్యాపార సంస్థల ప్రతినిధులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే దాడులు చస్తాం

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంను పక్కాగా అమలు చేస్తామని, ఏవరైన ప్లాస్టిక్ కవర్లు వాడితే వారిపై దాడులు చేస్తామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలుషాపులపై ఆయన అకస్మికంగా దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, పేపర్ కవర్లు, పేపర్ గ్లాసులు వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేదాన్ని సంపూర్ణంగా అమలు చేస్తామన్నారు. పలుషాపులను తనిఖీ చేయగా వారి వద్ద ప్లాస్టిక్ కవర్లు లభించడంతో వారికి జరిమానాలు విధించామన్నారు. ఏవరైన షాపుల యజమానులు ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిస అవుతున్న యువత


పులివెందుల రింగ్ రోడ్డు ప్రాంతంలో పడిఉన్న మత్తు పదార్థాలు, మత్తు ఇంజెక్షన్లు

పులివెందుల రూరల్ : ప్రస్తుత కాలంలో చాలామంది యువకులు మత్తుకు బానిసై తన జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. అదేదో ఒక ఫ్యాషన్ అన్న చందంగా చిన్నపిల్లలు సైతం పొగ, సిగరెట్లు తాగుతూ మద్యానికి బానిసవ్వడమేకాక మత్తు ఇంజెక్షన్లు కూడా వాడుతున్న సంఘటనలు పులివెందులలో చోటు చేసుకుంటున్నాయి. స్థానిక ఇందిరమ్మ రాణితోపు, రంగనాథస్వామి గుడి ప్రాంతం, బ్రాహ్మణపల్లె రోడ్డు, పార్నపల్లె రోడ్డు, న్యాక్ బిల్డింగ్, పాత మార్కెట్ యార్డు, శిల్పారామం, హెలీప్యాడ్, బెస్తవారిపల్లె గ్రామ సమీపంలోని లేఔట్, మార్కెట్ యార్డు సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లే వంద అడుగుల రోడ్డు తదితర ప్రాంతాలలో విచ్చలవిడిగా యువకులు మద్యం సేవిస్తూ మత్తుకు బానిసవుతున్నారు. మద్యంతోపాటు మత్తు ఇంజెక్షన్లు వాడుతూ ప్రాణాలను కొని తెచ్చుకుంటున్నారు. రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో మత్తు మందులు, ఇంజెక్షన్లు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ఈ మందులను ఎక్కువగా ఆసుపత్రులలో మహిళల డెలివరీ సమయంలో, శస్త్ర చికిత్సల సమయాలలో ఈ మందులను వైద్యులు వాడుతుంటారు. ఈ మత్తు మందులు వాడటంవల్ల 72 గంటల వరకు పనిచేస్తూ ఉంటుంది. కానీ అలాంటి మందులను సైతం పులివెందుల రింగురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఎక్కువ భాగం యువకులు వినియోగిస్తున్నట్లు సమాచారం.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి

ఇళ్లలోని తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లలు చదువుతున్నారా లేక చెడు అలవాట్లకు బానిస అవుతున్నారా అని ఎప్పటికప్పుడు తెలుసుకుని పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపైన కూడా ఉంది. సంబంధిత వైద్య నిపుణులు కూడా పిల్లలు ఎక్కువమంది మత్తుకు బానిసై మద్యం, బీర్లతోపాటు మత్తు ఇంజెక్షన్లు కూడా వాడుతున్నారని చెబుతున్నారు.

11 నుంచి శ్రీ విజయదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ అప్పగింత


మహిళను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కొండాపురం : మతిస్థిమితం లేని మహిళను వారి కుటుంబ సభ్యులకు గురవారం అప్పగించినట్లు ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కడపకు చెందిన షేక్ రషీద ఓబ్బన్నపేట గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉండగా అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, రాణి రామతులసి, పద్మావతి గుర్తించి కొండాపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కొంత కాలంగా ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని కడపలోని రవీంద్ర నగర్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆమెను కుటుంబ సభ్యులకు పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది సమక్షంలో అప్పగించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ఇసుక రీచ్‌ను పెట్టండి


ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీఓ, తహసీల్దార్, తదితరులు

వేంపల్లె : స్థానిక ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య సమక్షంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌పై పర్యావరణ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తే పాపాఘ్ని నదిలో దూరంగా ఏర్పాటు చేయాలని, పాపాఘ్ని నదిలోని కప్పల మడుగు సమీపంలో ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే పాపాఘ్ని నదిలో ఇసుకను భారీగా తరలించడం జరిగిందని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు తెలిపారు. ఇసుకను ఎక్కువగా తరలించడం ద్వారా పాపాఘ్ని నదిలో భూగర్భ జలాలు తగ్గి పోవడం జరిగిందన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ పెట్టినట్లు ఆర్డీఓ తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 17.013 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు చేపట్టడం జరుగుతోందని తహసీల్దార్ హరినాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గాలి హరిప్రసాద్, ముత్యాల ఆంజనేయులు, భూగర్భ శాఖ అధికారులు, ప్రజలు, రైతులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పి.వెంకటాపురం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఆటోను తనిఖీ చేయగా అందులో 17 బస్తాల ప్రభుత్వ బియ్యంను పట్టుకున్నట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఆటోను, వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.